అత్యంత ప్రతిష్టాత్మకంగా మహా రుద్రాభిషేకం

• ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే ప్రసన్న

కొడవలూరు : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరలా సీఎం కావాలని తలపెట్టిన మహా రుద్రాభిషేకాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నట్లు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. ఈనెల 20న నార్తురాజుపాళెంలోని టపాతోపు అండర్ బ్రిడ్జి వద్ద ఎమ్మెల్యే ప్రసన్న ఆధ్వర్యంలో చేపట్టనున్న నారికేళ సహిత రసలింగేశ్వర మహా రుద్రాభిషేకానికి సంబంధించి ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. కాగా ఈ ఏర్పాట్లను నిర్వాహకుడు, స్థానిక ఎమ్మెల్యే ప్రసన్న సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష కుంకుమార్చన, లక్ష బిల్వార్చన, సుదర్శన యాగం అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో భాగంగా శివునికి లక్షా 108 కొబ్బరికాయలు భక్తులు కొట్టేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని ప్రముఖ నేతలతో పాటు నియోజకవర్గంలోని ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. భక్తులే స్వయంగా స్వామివారికి కొబ్బరికాయలు కొట్టేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ బృహత్తరమైన కార్యక్రమానికి భక్తులు దంపతులుగా వచ్చి స్వామివారి ఆశీర్వాదం పొందాలని ఎమ్మెల్యే కోరారు. ఆయన వెంట డీసీఎమ్మెస్, డీఏఏబీ చైర్మన్‌లు వీరి చలపతిరావు, డి.నిరంజన్‌బాబరెడ్డి, ఏపీఎల్డీఏ చైర్మన్ జి.విజయ కుమార్, సీనియర్ నేత దువ్వూరు కల్యాణ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌లు గంధం వెంకటశేషయ్య, సుబ్బారెడ్డి, నవీన్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, మల్లారెడ్డి, సర్పంచ్‌లు ఎం.రంగారెడ్డి, ఎస్.శ్రీనివాసులు, పార్టీ నేతలు ఇసనాక సునీల్‌రెడ్డి, కొండా శ్రీనివాసులురెడ్డి, ఆర్.రాజేష్‌రెడ్డి, ఎం.మల్లికార్జున, బి.శ్రీనివాసులు ఉన్నారు.


మహా రుద్రాభిషేకం ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

క్లుప్తంగా

20న వేలంపాటలు

కొడవలూరు: మండలంలోని గండవరం ఉదయకశేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో దుకాణాల నిర్వహణకు ఈనెల 20న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బండి శాంతయ్య ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే మార్చి 4వ తేదీ నుంచి 12వ తేదీ వరకు దుకాణాల నిర్వహణకు తాత్కాలిక హక్కుల కోసం బహిరంగ వేలం నిర్వహిస్తున్నామన్నారు. బ్రహ్మోత్సవాల్లో టెంకాయలు, పూజా ద్రవ్యాల విక్రయం, స్వామి అమ్మవార్లకు నివేదించిన కొబ్బరి చెక్కల సేకరణ, రంగుల రాట్నం, తాత్కాలిక షాపుల ఏర్పాటు, పాదరక్షలు భద్రపరిచి రుసుము వసూలుకు వేలంపాటలు నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొనే వారు ధరావత్తు చెల్లించి పాల్గొనాల్సి ఉంటుందన్నారు. టెంకాయలు, పూజా సామగ్రి దుకాణానికి రూ.50 వేలు, కొబ్బరి చెక్కల సేకరణకు రూ.25 వేలు, రంగుల రాట్నం కోసం రూ.లక్ష, తాత్కాలిక దుకాణాలకు రూ.5 వేలు, చెప్పుల స్టాండ్‌కు రూ.5 వేలు వంతున ధరావత్తు చెల్లించాలన్నారు.

20న చేతిరాత పోటీలు

నెల్లూరు (టౌన్): జాతీయ చేతిరాత దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చేతిరాత పోటీలను ఈ నెల 20న నిర్వహించనున్నామని అచరిత్వ ఫౌండేషన్ నిర్వాహకుడు కృపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాగుంట లేఅవుట్లోని కృష్ణ చైతన్య జూనియర్ కళాశాలలో పోటీలను మధ్యాహ్నం రెండు గంటల నుంచి నిర్వహించనున్నామని చెప్పారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో పోటీలను నిర్వహించనున్నామని, జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రాష్ట్ర స్థాయి పోటీలను గుంటూరులో ఈ నెల 21న నిర్వహించనున్నారని పేర్కొన్నారు. వివరాలకు 98667 22532, 94913 39410 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

వేదగిరిలో విశేష పూజలు

నెల్లూరు రూరల్: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో స్వామి, ఆదిలక్ష్మి అమ్మవారికి విశేషాభిషేకాలు, పూజలను మంగళవారం నిర్వహించారు. కనుమను పురస్కరించుకొని అశ్వవాహనసేవ, పార్వేట ఉత్సవం, గ్రామోత్సవం, గో పూజను జరిపారు. ఆలయ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్ర రెడ్డి, ఈఓ గిరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు అందజేత

నెల్లూరు(బృందావనం): వివేకానంద జయంతి వారోత్సవాలను పురస్కరించుకొని బాలాజీనగర్‌లోని గీతామయి వృద్ధాశ్రమంలో వృద్ధులకు మిఠాయిలు, పండ్లను పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో మంగళవారం పంపిణీ చేశారు. నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి ఆకుల మహేంద్రరెడ్డి, పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు, గౌరవాధ్యక్షుడు కొండూరు హరినారాయణరెడ్డి, చెన్నయ్య, ఆశ్రమ నిర్వాహకుడు పాండు, భవ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలి



నెల్లూరు(బృందావనం): మైపాడు గేట్ సమీపంలోని జాఫర్‌సాహెబ్ కాలువలో మంగళవారం రాత్రి నిర్వహించిన భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి తెప్పోత్సవానికి నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ హాజరయ్యారు. స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి అనుగ్రహంతో ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఎమ్మెల్యే కాంక్షించారు.

దేవస్థానానికి నగదు విరాళం

పొదలకూరు : స్థానిక శ్రీనివాస లేఅవుట్‌లో ఉన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి మంగళవారం దేవినేని శివరామయ్య-లలితమ్మ దంపతులు రూ.1,00,116 నగదు విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థానం నిర్వహణ కమిటీ బాధ్యులకు నగదు మొత్తాన్ని అందించారు. దేవస్థానం అభివృద్ధి పనులకు ఈ నగదును వినియోగిస్తామని నిర్వాహకులు వెల్లడించారు. కార్యక్రమంలో ఎం.శ్యామ్‌ప్రసాద్, దాసరి శ్రీనివాసులు, చొప్పా వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ముగిసిన క్రికెట్ పోటీలు

ఇందుకూరుపేట : సంక్రాంతిని పురస్కరించుకుని మండలంలోని జగదేవిపేటలో నాలుగు రోజుల పాటు జరిగిన గ్రామస్థాయి క్రికెట్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో బొల్లినేని మోహనకృష్ణ మెమోరియల్ జట్టు విజేతగా నిలువగా, జేఎస్కే టీమ్ రన్నర్‌గా నిలిచింది. విజేతలకు వైఎస్సార్‌సీపీ నేత బట్టేపాటి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతిని పురస్కరించుకుని క్రికెట్ పోటీలో యువకులు ఉత్సాహంగా పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో వెంకటరమణారెడ్డి, సుజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతుల ప్రదానం

వైఎస్సార్‌సీపీలో టీడీపీ నేత చేరిక

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలోని 18వ వార్డుకు చెందిన టీడీపీ నాయకుడు మీరావలి మంగళవారం కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న కుమార్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. బుచ్చిరెడ్డిపాళెంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఈ మేరకు వైఎస్సార్‌సీపీ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మీరావలి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి పార్టీలో చేరినట్లు తెలిపారు.


ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డితో మీరావలి

కోళ్ల లారీ బోల్తా

• ఎగబడిన స్థానికులు
• నలుగురికి స్వల్ప గాయాలు

మనుబోలు : కోళ్ల లారీ అదుపుతప్పి బోల్తా పడి నలుగురు స్వల్పంగా గాయపడిన ఘటన మండల కేంద్రమైన మనుబోలులో మంగళవారం తెల్లవారుజామున జరిగింది. చిత్తూరు జిల్లా పుంగనూరు నుంచి నెల్లూరుకు 1,080 కోళ్లతో వెళ్తున్న లారీ మనుబోలులో ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తా పడింది. లారీ డ్రైవర్ సుజిత్, క్లీనర్ సందీప్‌తో పాటు మరో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. లారీలోని కోళ్లు జాతీయ రహదారిపై గుట్టలు, గుట్టలుగా పడిపోవడంతో సమీపంలోని కాలనీవాసులు కోళ్ల కోసం ఎగబడ్డారు. నిమిషాల వ్యవధిలో కోళ్లన్నీ మాయమయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


కోళ్లను తీసుకెళ్తున్న స్థానికులు

వైభవంగా పల్లకిసేవ




కోవూరు : కోవూరులో వెలసిన శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి పల్లకిసేవ వైభవంగా జరిగింది. తొలుత ఆలయ అర్చకుడు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి పూలంగి సేవ, పల్లకి సేవను కనులపండువగా గావించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా తాటిపర్తి విజయకుమార్‌రెడ్డి, కుటుంబ సభ్యులు వ్యవహరించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమానికి ఉభయకర్తలుగా పెద్ది ప్రభావతి జ్ఞాపకార్థం కుమారుడు నాగార్జున కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

వాలీబాల్ విజేత నెల్లూరు

విడవలూరు : సంక్రాంతి పండగ సందర్భంగా మండలంలోని అన్నారెడ్డిపాళెం గ్రామంలో ఏఆర్పీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో నెల్లూరు జట్టు విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా మంగళవారం విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా ఈనెల 14, 15, 16వ తేదీల్లో పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. ఈ టోర్నీలో నెల్లూరు ఎన్టీఆర్ నగర్ జట్టు విజేతగా నిలువగా మాజీ ఏఎంసీ చైర్మన్ రామిరెడ్డి విజయభానురెడ్డి బహుమతి ప్రదానం చేశారు. రెండో స్థానంలో నిలిచిన అన్నారెడ్డిపాళెం జట్టుకు మాజీ ఎంపీటీసీ సింహాద్రి అయ్యప్ప బహుమతిని అందజేశారు.


నెల్లూరు జట్టుకు బహుమతి ప్రదానం

సంక్రాంతి కోలాహలం

మండలంలోని అన్నిగ్రామాల్లో సంక్రాంతి పండుగను సోమ, మంగళవారాల్లో ఘనంగా జరుపుకున్నారు. విద్య, ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు స్వగ్రామాలకు చేరుకోవడంతో సందడిగా మారింది. స్నేహితులు, బంధువులతో కలిసి పూజలతో పాటు ఆటపాటలతో సంతోషంగా గడిపారు. పండుగ సందర్భంగా పలు గ్రామాల్లో జరిగిన రంగవల్లుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతి గ్రామంలో సంక్రాంతి కోలాహలం నెలకొంది.


తోటపల్లిగూడూరు : మాచర్లవారిపాళెంలో దుప్పట్ల పంపిణీ

పొదలకూరు : మండలంలోని అన్నిగ్రామాల్లో పాడి రైతులు మంగళవారం వేడుకగా కనుమ పండగను జరుపుకున్నారు. పశువుల కొమ్ములకు రంగులు వేసి అలంకరించారు. సాధారణంగా పంట చేతికి వచ్చిన సందర్భంగా వ్యవసాయానికి పాడికి ఉపకరించే పశువులకు పూజలు చేయడం ఆనవాయితీ. అయితే ఈ ప్రాంతంలో పంటలు ఇంకా చేతికి రానందున రైతులు పశువులకు పూజలు చేశారు. ముఖ్యంగా గోవులు, గేదెలు, వ్యవసాయ పనులకు ఉపయోగించే ఎద్దులను అలంకరించారు.

సంతోషంగా..

ఇందుకూరుపేట : సంక్రాంతి, కనుమ పండగలను మండల వాసులు సంతోషంగా జరుపుకున్నారు. కనుమ పండగ రోజున రైతులు పశువులను పూజించారు. గోమాతకు ప్రత్యేక పూజలు జరిపారు. గ్రామాల్లో వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

ఇనమడుగు గ్రామంలో..

కోవూరు : మండలంలోని ఇనమడుగు గ్రామంలో ఎనిమిదో వండర్స్ యూత్ ఆధ్వర్యంలో సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు రూ.10,000 నుంచి రూ.1000 వరకు పది మందికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నాబార్డ్ డీడీఎం రవిసింగ్ హాజరై, విజేతలకు బహుమతులు అందించారు. ఈ పోటీలో తొలి మూడు స్థానాల్లో మానస, రాజేశ్వరి, మధుశ్రీ నిలిచారు. కార్యక్రమంలో మారంరెడ్డి విక్రమ్‌రెడ్డి, వేమారెడ్డి శరత్‌కుమార్‌రెడ్డి, నిర్వాహకులు ప్రసాద్ రెడ్డి, శ్రీనివాసనాయుడు, పెరమారెడ్డి సురేష్, అమరేందర్‌రెడ్డి, శివప్రసాద్ పాల్గొన్నారు.

• **తోటపల్లిగూడూరు :** సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎన్‌డీఆర్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఆధ్వర్యంలో మాచర్లవారిపాళెంలో సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌డీఆర్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత నాయుడు ఆదికేశవులరెడ్డి పేదలకు దుప్పట్లు, చీరలను పంపిణీ చేశారు. ఇదే క్రమంలో ఎస్ఎస్ కన్‌స్ట్రక్షన్స్ గ్రూపు సంస్థ ఆధ్వర్యంలో పాపిరెడ్డిపాళెంలో ముగ్గుల పోటీలు కోలాహలంగా జరిగాయి. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.


పొదలకూరు : గోవును పూజిస్తున్న చిన్నారులు


పొదలకూరు : పశువులకు రంగులు వేస్తున్న రైతన్న


కోవూరు : మానసకు మొదటి బహుమతి అందజేస్తున్న నాబార్డ్ డీడీఎం


తోటపల్లిగూడూరు : పాపిరెడ్డిపాళెంలో విజేతలకు బహుమతుల ప్రదానం

ఎమ్మెల్యే ప్రసన్న పరామర్శ



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : పట్టణంలోని 19వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత ఎస్.శ్రావణ్ కుమార్ ఇటీవల బ్రెయిన్ సంబంధిత ఆపరేషన్ చేయించుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మంగళవారం పట్టణంలోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి ఆరాతీశారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు.

నేడు నిడిగుంటపాళేనికి మంత్రి కాకాణి

వెంకటాచలం : రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి బుధవారం నిడిగుంటపాళెం గ్రామంలో పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండల వెంకటశేషయ్య మంగళవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు గ్రామానికి చేరుకుని నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని, సీసీరోడ్లను ప్రారంభిస్తారని వివరించారు.

చెంచుల అభివృద్ధికి సైకిల్ యాత్ర



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ఆంధ్రా, తెలంగాణ సరిహద్దు శ్రీశైలం అటవీ ప్రాంతంలోని నివసిస్తున్న చెంచుల అభివృద్ధి కోసం యువకులతో కలిసి శ్రీశైలం నుంచి కన్యాకుమారి వరకు సైకిల్‌యాత్ర చేపట్టామని నిర్వాహకుడు వంశీధర్ కాళిదాసు తెలిపారు. సైకిల్‌యాత్ర మంగళవారం బుచ్చిరెడ్డిపాళెం చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చెంచులు క్రీడల్లో పాల్గొనేలా ప్రోత్సహించడం, విద్యనభ్యసించేలా చేయడం తమ ప్రధాన కర్తవ్యమన్నారు. అందులో భాగంగా అవగాహన కోసం సైకిల్‌యాత్ర చేపట్టినట్లు తెలిపారు.

ఇనమడుగులో స్లో బైక్ రేస్

కోవూరు : సంక్రాంతి సంబరాల్లో భాగంగా కోవూరు మండలం ఇనమడుగు గ్రామంలో యువకులకు స్లో బైక్ రేసింగ్ పోటీలను మంగళవారం నిర్వహించారు. గ్రామ పోలేరమ్మ దేవస్థానం ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో మొత్తం 80 మంది పాల్గొనగా అందులో మహిళలు ఉండడం విశేషం. విజేతలకు నగదుతో పాటు ప్రత్యేక బహుమతులను అందజేశారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి యువకులు అధిక సంఖ్యలో హాజరై తిలకించారు.



మహా రుద్రాభిషేకానికి తరలిరండి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : ఈనెల 20న కొడవలూరు మండలం నార్తురాజుపాళెంలో తలపెట్టిన మహా రుద్రాభిషేక కార్యక్రమానికి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి నాయకులు, అభిమానులు తరలిరావాలని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కోరారు. బుచ్చిరెడ్డిపాళెంలో మంగళవారం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2024లో మళ్లీ సీఎం పీఠం అధిష్టించాలని 40 మంది వేద పండితులతో యాగం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా లక్ష కొబ్బరికాయలు, లక్ష రుద్రాక్షలు, లక్ష బిల్వార్చన, లక్ష కుంకుమార్చనతో పాటు సుదర్శన యాగం నిర్వహిస్తామన్నారు. ప్రజలు, నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సిమెంట్‌రోడ్డు ప్రారంభం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : నగర పంచాయతీ పరిధిలోని నాలుగో వార్డు ప్రైడ్ డ్రీమ్స్ అపార్ట్‌మెంట్ వీధిలో సిమెంట్‌రోడ్డును మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ మాట్లాడుతూ గతంలో ఇక్కడ రోడ్డు అధ్వానంగా ఉండేదని, దీనిని ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. స్పందించిన ఆయన వెంటనే నిధులు మంజూరు చేశారని తెలిపారు. సిమెంట్‌రోడ్డు నిర్మాణం త్వరితగతిన జరగడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

చౌకచర్లలో నేత్రదానం

విడవలూరు : మండలంలోని చౌకచర్ల గ్రామానికి చెందిన తలువాయి జయమ్మ (70) సోమవారం మృతి చెందారు. ఆమె నేత్రాలను కుటుంబ సభ్యుల కోరిక మేరకు మనసేవా సంస్థ చైర్మన్ దేవళ్ల శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరు మాదరన్ ఐ ఆస్పత్రి వారికి దానం చేశారు. ఐ టెక్నీషియన్ వేణు ఆమె నేత్రాలను సేకరించారు.


జయమ్మ (ఫైల్)

కోడి పందెం నిర్వాహకుల అరెస్ట్

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని కాగులపాడు సమీపంలో కోడిపందేలు నిర్వహిస్తున్న ఏడుగురు వ్యక్తులను మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. కాగులపాడు సమీపంలోని పెన్నానది వద్ద కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడులు చేశారు. అందులో భాగంగా ఏడుగురిని అరెస్ట్ చేశారు. రెండు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మహేంద్ర తెలిపారు.